కథానిక

# "చిన్న" వాళ్లు

రంధి సోమరాజు

రైల్లో కాలు పెడుతూండగా గుండెలు దడదడలాడాయి. వాటి ఆందోళనను గమనించనట్టుగానే పెట్టెలో కాలు పెట్టాను. ఆయన నిశ్చింతగా బండిలో ఎక్కారు. రోజూ ఆయం మొగంలో వెలిగే చిరునవ్వు అప్పుడూ అలాగే ఉంది. బండి స్టేషను దాటేవరకు, చీకటివెలుగుల మధ్య నడకసాగించి, ఆ తరువాత అది పూర్తిగా చీకటిలోకి పారిపోయింది.

బండిలో అప్పటికే అందరూ నిద్రపోతున్నట్టు నటిస్తూ, క్రొత్తవాళ్ళకు చోటులేకుండా చేసేశారు. ఎవర్ని ఎలా లేపాలో మాకు తోచలేదు. వాల్తేరు వరకూ అలానిలబడే ఉండగలమా అన్నది—తలచుకోడానికే భయమేసింది. ప్రయాణంలో ఒకరోజు కలసి వస్తుందని ఈబండి ఎక్కినందుకు మంచి ప్రాయశ్చిత్తమే అయింది. నాకైతే ఈ ఇబ్బందిని గురించిన బాధలేదుకాని, ఇలాంటి బాధల ననుభవించలేని ఒక పెద్దమనిషిని నేనే ప్రోత్సహించి, నా మాటకు తిరుగులేకుండా చేసుకున్నందుకు అప్పట్లో విజయగర్వం అనుభవించినా, ఈ పరిస్థితిలో ఆయన్ను చూడటానికే నా మనస్సెంతో జంకింది. ఆయనగారి నోటివెంట ఏమాట వస్తుందో అన్నది నా ఊహ కందలేదు.

అయినా ఆయన మొగంలోకి ఎలాగో ఓలాగ త్రోసుకొని చూశాను. ఆయన 'నేను చెప్పలేదూ' అన్నట్టుగా ఓ చిరునవ్వు నవ్వి, ఏమీ మాట్లాడకుండా ఊరుకున్నాడు- నేనో వెకిలినవ్వు నవ్వి, నా నోటికి వచ్చిందేదో ప్రేలాను ఆ బండిలో నిద్రిస్తున్నట్టు నటించే సోదరుల గురించి, ఇంగ్లీషులోనే అనుకోండి; కొంచెం కటువుగానే అన్నాను. ఇలా అన్నందుకు తరువాత చాల బాధపడినా! దాని ఫలితం మాత్రం ఊరకనే పోలేదు. చాలమంది తేలుకుట్టిన దొంగల్లా మెదలకుండా ఊరుకున్నా, ఒకాయన, "ఎందాకండీ ప్రయాణం?" అంటూ మాకు కూర్చోడానికి అవకాశం కల్పించి ఎంతో పుణ్యం కట్టుకున్నాడు. అయితే బండి రాజమండ్రి చేరేప్పటికి, పైన నిద్రిస్తున్న ఇద్ధరు దిగిపోవడంవల్ల మేము బెడ్డింగులతో సహా మా తనువుల్ని ఆ పైకి చల్లగా చేర్చేశాం.

తిరిగి సుఖంగా ఆయన మొగంలోకి చూడటానికి నాకు దొరికిన ఈ సదవకాశాన్ని జారవిడుచుకోకుండా అటువైపు మనసార చూశాను. కాని అక్కడ అంతా చీకటే! ఆయన కంఠం వినిపించడం మినహానే నాశించింది కాంచలేకపోయాను. అయినా నా మనస్సులో ఇందాకటినుంచి పెద్దబరువుగా ఉన్న అతృప్తి ఇప్పుడు తొలగిపోయిందనే చెప్పాలి. కాని నాలో ఇంకా ఏమిటో భయం భయంగానే ఉంది. నేరకపోయి ఈ ప్రయాణం పెట్టాను కదా అనుకున్నాను. నా హద్దుల్లో నేను ఉండవలసింది పోయి, గొప్పలకు పోతున్నానా అని తెగనలిగి పోయాను.

ఆయనతో నేను అనేక స్థలాలకు ఎన్నోసార్లు తిగాను. కాని ఇలాంటి బాధ నే నెప్పుడూ అనుభవించలేదు.

ఆయనకూ నాకూ పరిచయము సుమారుమూడు సంవత్సరాలనుంచి ఆయన మరీ ధనవంతుడు. కాకపోయినా, ఉన్నవాడనే చెప్పాలి. అలాగేనేను నిరుపేదననీ అనుకోడానికి వీల్లేదు. ఇంకొక ముఖ్యవిషయం: ఆయన కాయనే సాటి!అలాంటివానిని నేనింతవరకూ చూడలేదు. అంత సహృదయుణ్ణి స్నేహితునిగా పొందగలిగిన భాగ్యం నిజంగా ఒక అదృష్టం! ఏది ఎలాగున్నా అన్నిటికన్నా ముఖ్యమైనది ఆయన వయస్సు. ఆయననాకన్నా పెద్దవాడు. ఆయన అన్ని విధాలా ఎలా నాకన్న పెద్దవాడో నేనన్నివిధాలా మరి అలాగే ఆయనకన్న చిన్నవాణ్ణి!

ఔను; నేను చిన్నవాణ్ణే! కాని నేను ఆయనతో ఎక్కడికి వెళ్ళినా, ఆయనతో సరిసమానమైన గౌరవాన్నే పొందాను. నాకు ఎక్కడా

ఏ విషయంలోనూ లోటు జరుగలేదు. పైపెచ్చు ఆయన నా విషయంలో చాల శ్రద్ధతీసుకునేవాడు. అయితే ఇందులో ఏమంత విశేషించి ఉల్లేఖించవలసిన విషయం లేకపోవొచ్చు. కాని ఉందనే చెప్పాలి! నన్ను ఆయన తన మిత్రులకు పరిచయము చేయడములో ఒక విశిష్టమైన సాంప్రదాయాన్ని ఆచరించేవాడు. ఆ మిత్రులు నన్ను ఎంతో ఆదరంతో చూసేవారు.

అయితే ఒక ముఖ్య విషయం: ప్రయాణాలు చేశాం; మహా మహా హేమా హేమీలైన నగరాలను వీక్షించాం; మహోన్నత పర్వతశిఖరాల పై విహరించాం; ఎన్నెన్నో వింతల్ని తిలకించాం అన్న సంబరమేగాని, ఆయాస్థలాలో మానవులలో ఉండే ఈ ఆప్యాయత, ఈ సమాదరణ, ఈమహోతృష్టమైన అతిథిసత్కారపు సేవాతత్పరత, ఈ పిపాస నేనెప్పుడూ గుర్తుచేసుకోలేదు. అట్లాంటి పరిస్థితి నాకెప్పుడూ కలుగలేదు.

ఔను; నాకు కలుగలేదు! కాని అదంతా ఇప్పుడిప్పుడే నాకు గుర్తుకొస్తూంది. దీనితో నా బాధ్యత మరింత పెరిగిపోవడం మొదలుపెట్టింది. అయితే ఇది నా హృదయ దౌర్బల్యానికి చిహ్నం కావొచ్చు! కాని, నేను ఆనాడు ఆయనతో అన్న మాట మీద — నాకున్న ప్రతిష్ట మంటగలసిపోకుండా. ఈ ప్రయాణం దాని మనుగడకు ఎంత వరకు దోహదం కాగలదా అన్నదే నా సంశయమై పోయింది!

దీని కంతటికీ కారణం మా రామం. వాడు మమ్మల్ని ఆహ్వానించి ఉండకపోతే, ఈ ప్రయాణమూ ఈబాధా ఉండకనేపోయేవి. రామం నాకైతే మిత్రుడుకాని, ఆయనకు మాత్రం కేవలం పరిచయస్థుడే. ఇద్దైనా నాద్వారానే. కేవలం కొద్దిరోజుల పరిచయాన్ని పురస్కరించుకొని, ఓ రోజున వాడు, నాదగ్గఱ కొచ్చినప్పుడు నాతో బాటు ఆయన్నుకూడ, అరకులోయ మాచ్ ఖండ్ ప్రాజెక్టు చూసేందుకు ఆహ్వానించాడు. ఈ ఆహ్వానపు ముందు వెనుకలు సాకల్యంగా సమాలోచించుకోకుండా, నేను ఆయన్ను బలవంతం చేశాను. సరే అంటే సరే అనుకున్నాం.

అయితే రామంవంటి మిత్రుని ఇంటికి ప్రయాణమవడంలో ఇంత సంకోచించ వలసిన విషయమేమిటీ అని ఎవ్వరైనా అడగొచ్చు. దీనికి సమాధానం నేను ఇదీ అదీ అని చెప్పలేకపోయినా, ఒక విధంగా ఆయనంటే నాకుండే పూజ్యభావమే, అందుకు కారణం అని చెప్పాలి. అయితే నే నొకానొకనాడు దీన్ని గురించి వితర్కంలో పడ్డప్పుడు, ఆ రోజున దీనికి కారణం మరొక విధంగా లభించింది. ఆయనకున్నటువంటి ఆదర్శవంతులైన మిత్రుల్లాంటివారు, నాకూకొంతమంది ఉన్నారన్న ఆర్భాటపు ప్రదర్శన విజయవంతమౌతుందో అవదో అన్నదే—యీ భయాందోళనలకు హేతువన్నది ఆనాడు విశదమైంది.

పాపం మా రామం చాలామంచివాడు. వాడెంత మంచివాడంటే, వాడ్ని నేనొకసారి ఛెళ్లున లెంపకాయ కొట్టగా జరిగిన విశేషం చెప్తాను వినండి. ఎందుకు ఎప్పుడుకొట్టానో ముందు చెప్పనీండి. నిజానికప్పుడు చాల చిన్నతనం. ఘట్టుఘారం కాబోలు వెలిగిస్తున్నాం. ఇద్దరమూ ఒకేచోట కూర్చొని 'మేపు' వేసుకుంటున్నాం. వాడు నీలం రంగు పెన్సిలు నన్నడిగాడు. నేను నాపటంపూర్తి అయితేగాని కుదరదన్నాను. వాడు ఇవ్వమనిదాన్ని లాక్కోబోయాడు. నేను ఇవ్వనని తిరిగిరెట్టించాను. కాని వాడు తనపట్టు వదలేదు. బలవంతంగా (నవ్వుతూనే) దాన్ని నాచేతిలోంచి అంది పుచ్చుకోబోయాడు. అంతే—నేను వాడి చెంపమీద ఛెళ్ళుమనిపించాను. వాడికళ్ళల్లో నీలాలుతిరిగాయి. నిజానికి అప్పుడువాడు నన్ను తిరిగి తన్తే వాడ్ని నేనేమీ చేయలేనంతటి బలహీనుణ్ణి! కాని అలాంటిది జరగలేదు. వాడు లావుగా బొద్దుగా ఉండేవాడు. నేను గాలేస్తే ఎగిరిపోయేవాడిలా ఉండేవాణ్ణి. కాని వాడెందుచేత తిరిగి నన్ను కొట్టలేదో నాకిప్పటికీ అర్థంకాలేదు. పోనీ వాడు పిరికివాడని సరిపెట్టుకుందామా అంటే అందుకసలే వీలులేదు. కాని ఆ తరువాత వాడే నాకన్న ముందు నాతో మాట్లాడేడనీ చెప్పడాని కిప్పటెంతో సిగ్గుగానే ఉన్నా నిజానికానాడు ఎంతో గర్వించాను.

ఇలాంటి మా రామం ఇంటికి వెళ్తూన్నప్పుడు నేను ఇంతవరకూ పడ్డ బాధ శుద్ధ అనవసరమనే అనిపిస్తుంది. కాని నేనేమిటో తాడూబొంగరమూ లేకుండా ఇలా ఆలోచిస్తూ, కొంచెంకొంచెంగా నిద్రిస్తూ నిద్రిస్తూ ఉండగా ఆయన, 'అయితే

రామానికాయన ఏమౌతాడన్నావ్?" అన్నాడు. "చిన్నాన్నండీ...రామంతల్లీ, ఆయనభార్యా అక్కచెల్లెళ్ళు. బలే చురుకైన వాడులెండి" అన్నాను. మా సంభాషణ మా రామం చిన్నాన్న పరంగా పరుగెత్తించడానికి నేనుచూపించిన ఆత్రుత ఆయన పసిగట్టినట్లుగా, వెంటనే ఆయన మా సంభాషణ మార్చేసి, "అయితే బండి అక్కడకు చేరేటప్పటికి తెల్లవారిపోతుందనుకుంటాను." అన్నాడు గట్టిగా ఆవలించి. నేనుమాత్రం ఆలోచించకుండా 'మీకు కొంచెం చికాగ్గా ఉందనుకుంటాను' అన్నాను: ఆయన ఏ దృష్టిలో ఉన్నాడో కాని "ప్రయాణం అంత చికాగ్గాలేదుగాని నిద్ర ఎంచేతనో రావడం లేదు" అన్నాడు. నేను మాట్లాడలేదు. ఆవలింతలు నిద్రకు సూచనగా...అనబోయి మానేశాను. ఆయన నిద్రపోకుండా అంతవరకూ ఏమిటి ఆలోచిస్తున్నాడాఅన్నది తెల్సుకోలేని అశక్తతతో కొంచెం మనసులో చికాకుపడ్డాను. ఇంతలో ఆయన, 'ఏమిటి నిద్రపోతున్నావా?'అన్నాడు. నేనుగభాలునకొంచెం కంగారుగా, "కాదు...రామం...చిన్నాన్న..." అన్నాను. "ఏం...ఆయన మాచ్ ఖండ్‌లో లేరేమిటి..."అన్నాడాయన. "అబ్బే...నేనాయన దగ్గర కొన్నాళ్లు చదువుకున్నాలెండి. ఇంతకు ముందు మీకీ విషయం చెప్పలేదు" అన్నాను. "అయితే ఇంకేం...మీ గురువుగారి పరిచయం మాకు లభిస్తుందన్నమాట!" అన్నాడాయన. ఈ మాట అన్నప్పుడు ఆయన నవ్వుతూ ఉండి ఉండాలి. నేనొక పూర్తిగాని నవ్వునవ్వి, "ఓ, తప్పకుండా!" అన్నాడు.

ఇంజనీరు శివరామారావుగారు రామం చిన్నాన్న. ఆయన చాలా తెలివైనవాడని ప్రసిద్ధి. తెలివికన్న ఆయన చాలా మంచివాడు. ఎంతో చక్కగా మాట్లాడుతాడు.

నేనెప్పుడో ఐదారు సంవత్సరాలక్రితం ఆయన వద్ద చదివాను. అయితే మాకప్పుడాయన చదువే చెప్పాడుకాని, రాజకీయాలు చెప్పలేదు. దరిమలాను మా రామం అప్పుడప్పుడేమైనా చెప్తేచెప్పినట్లు లేకపోతే లేనట్లు. అంతకన్నా నాకాయనగారి సంగతులు తెలియవు.

బండి విసురుగా పోతూ చలిగాలిని త్రవ్విపోస్తూంది. నేను దుప్పటితీసి పూరాగా ముసుగు పెట్టేశాను. ఇంతలో ఏదో అకస్మాత్తుగా గుర్తొచ్చి, దుప్పటి కొంచెం తొలగించి, ఎందుకైనా మంచిదని, "ఇంతకీ మా రామం స్టేషనుకు తగలబడతాడో లేదో..."అన్నాను మెల్లగా. ఆయన ఇంకా నిద్రపోలేదు. "అరే...మరి మీ రామం స్టేషనుకు రాకపోతే, ఎలా ... కొంపమునిగిందే..." అన్నాడాయన పకపకా నవ్వుతూ. ఈ మాటతో నాలో నేను కుదించుకొనిపోయాను. "అబ్బే, ఊరకనే అన్నానండి!" అని దుప్పటిలోకీ తల దూర్చేశాను.

సుమారు నాలుగున్నర అయ్యేటప్పటికి, మా బండి వాల్తేరుకు తీసుకొచ్చి మమ్మల్ని పడేసింది. నేను బండి దిగుతూ ఆయనలోకి నవ్వుతూ చూశాను. ఆయనా, నన్ను చూసి నవ్వాడు. ఆయన ఎందుకు నవ్వాడో నాకు తెలియదు. కాని నేనుమాత్రం ఆయనను యింతవరకు ఈడ్చుకరాగలిగాను కదా అన్న తృప్తి జాస్తీ అయి నవ్వాను. కాని అది ఇంతలోనే చెరిగిపోయింది. మా రామం ఎక్కడా కనిపించలేదు. వాడు తప్పక మాకోసం స్టేషనుకు వస్తానని ఉత్తరం వ్రాశాడు. కాని రాలేదు. నా గుండెల్లో ఎంత బాధ కలిగిందో పైకి అంత కోపమూ తన్నుకొచ్చింది. ఈ మాత్రపుదానికి స్టేషనుకు వస్తానని ఉత్తరాలు దండుగచేయడమెందుకూ?...ఎందుకైనా మంచిదని, బండిలో ఆయనతో అలా అనడమే మంచిదైంది. వెధవ... "సరే...రిక్షా మాట్లాడుకొని పోదామండి. వెధవకి మెలుకువ రాలేదనుకుంటాను. మనవాళ్ళెప్పుడూ ఇంతే...అనుకున్న పని అనుకున్నట్టుగా జరుపలేరు. చేతావాతాగానివాళ్ళు" అనేశాను కసిగా; నాకు తెలియకుండానే ఆయనగారి సానుభూతిని పూర్తిగా కొల్లగొట్టేందుకు. అసలు నా అసమర్థతను కప్పిపుచ్చుకోడానికి ఇదొక దొంగెత్తేననుకోండి. అయినాసరే, అలా అనేశాను. కృతకంగా ఆయన దిక్కై నిలచిన నా మొఖాన్ని ఓ ప్రక్కకు నెట్టేశాను. అప్పుడాయన, "ఎందుకలా నలిగిపోతావు? ఇందులో పెద్ద ముంచుకుపోయిం దేముంది? చీకటినే లేచి రావడం ఎంతటివారికైనా ఇబ్బందే! ఇంతకీ మనం అక్కడకు వెళ్ళలేమా ఏం? నీవంతా ఛాదస్తం!" అన్నారాయన. అసలు నేనెలాంటి మాటలకోసం

ఎదురుచూశానో అలాంటివే ఆయన నోటివెంట వచ్చాయి. సహజంగా అప్పుడు నేను మావాడిపై మరి కొంచెంసేపు విరుచుకపడవలసిన అవసరం ఉంది. కాని ఇంతలోనే హడావుడిగా మా రామం మాముందు ప్రత్యక్షమయ్యాడు.

అబ్బ! ఇక అప్పుడు నా హృదయంలో కలిగిన ఆనందం ఏమనిచెప్పను! వేయి డుడుమా జలపాతాలనుంచి ఉద్భవించిన విద్యుత్తు నొక్కసారిగా, ఒక్కచోట వెలిగించినట్లు అది మహోజ్వలమైన సౌందర్యంతో ప్రకాశించింది. కాని, నేను ఇంత ఆనందాన్ని పది, పదిహేను సంవత్సరాల క్రితంవరకూ మానవమాత్రుడెవ్వడికీ తెలియబడని ఆ డుడుమా జలపాతపు నిగూఢ రహస్యంలాగే, దాన్ని నా మనసులో అనంతగిరుల ఆవల, అరకు లోయకు ఇంకా ఇంకా దూరాన, ఎక్కడో ఎవ్వరికీ తెలియనిచోట పదిలంచేసేశాను.

మా రామం క్షమార్పణాపూర్వకమైన అతి సన్నని కంఠంతో, సన్నని నవ్వు మొఖంమీద లీలగా ప్రకటిస్తూ, "నమస్కారమండీ!...క్షమించాలి. కొంచెం ఆలస్యమైంది"అన్నాడాయనతో. ఆయన చిలిపిగా నవ్వుతూ, "ఆఁ, క్షమాపన నాకు కాదండోయ్...అదిగో మీ స్నేహితుని ముఖారవిందాని కర్పించండి. ఆ నైవేద్యం పడందే, అతనికి ఆకలి తీరదు. తీరని ఆకలితో, ఆరని మంటలను వెదలల్లొచ్చు! ముందు ఆప్రమాదంనుంచి తప్పించుకోండి"అన్నాడు.

నేను—నాలో మెరిసిన కోపాన్ని గట్టిగా ప్రదర్శించలేని నేను, ఆ మాటలకు కోపమూ నవ్వూ కలగలుపుల భంగిమ ఒకటి సృష్టించకుండా ఉండలేకపోయాను. ఇంతలో మా రామం, "మావాడి కోపం నాకు తెలియంది కాదు. చిన్నప్పటినుంచీ భరిస్తున్నాం. ఇకముందుకూడా భరించక తప్పదు" అన్నాడు. దీనితో అందరమూ ఒకసారి రకరకాలుగా నవ్వుకోక తప్పలేదు.

ఆరోజున విశాఖపట్నంలో కాలక్షేపంచేసేసి మరునాడుదయమే మాచ్ ఖండ్ చూడ్డానికి నిర్ణయించుకున్నాము.

ఆ రాత్రంతా నాకు నిద్రపట్టనేలేదు: నాలో, ఎప్పుడు ఆ అరకులోయ చూస్తామా...ఎప్పుడు డుడుమా జలపాతాన్ని వీక్షిద్దామా అన్న ఆలోచనలే అధికమైపోయాయి. రామం చిన్నానను ఎప్పుడు వీరికి పరిచయం చేస్తానా అని ఎంతో ఆత్రుతపడ్డాను.

మా రామం, ఆరాత్రి మాతో చాలసేపు మాట్లాడి, ఎప్పటికీ తెమలని మాటలను సగంలో తుంచేస్తూ 'పడుకోండి...మళ్ళీ చీకటినే లేవాలి' అంటూ తన గదిలోకి దారితీశాడు. అప్పుడే ఆయన నావైపొకసారి చూసి ఏదో చెప్పబోయి, మళ్ళీ మానేశాడు. నేను, ఏమిటండీ అన్నాను ఆయన 'అబ్బేఁ...ఏమీలేదు' అన్నాడు. 'ఏదో చెప్పబోయి మానేశారు' అన్నాను, తప్పకుండా మీరు చెప్పాలి అన్నధ్వని నా కంఠంలోచూపిస్తూ.

"అబ్బేఁ ఏమీలేదు. మనం ఇక్కడకు రావడం నాకు నచ్చలేదు" అన్నాడాయన.

నాగుండె లొక్కసారి గిజగిజ కొట్టుకున్నాయి. నా నోటివెంట మాటరాలేదు. అతిపేలవమైన కంఠంతో, 'ఏమండీ...' అన్నాను. ఆకంఠం చివర జీరపోయింది. కొంచెం వణికిందేమోకూడా.

అప్పుడాయన, 'అబ్బే! ఏమీలేదు. అతన్నిలా బాధపెట్టడం నాకు నచ్చలేదు' అన్నాడు.

నేనొక్కసారి పూర్తిగా ఊపిరి పీల్చుకున్నాను. నా గుండెల్లోకి ఉత్సాహపూరితమైన తరంగాలెక్కడినుంచో గంతులేసుకుంటూ వచ్చాయి. నేనిదేమీ గమనించట్టుగానే, "అయితే స్నేహితులుండి దేనికి? ఇక్కడ ఉండకుండా, మన మింకెక్కడైనా ఉంటే, అప్పుడు వాడు పడే బాధ మనం భరించగలమా?" అన్నాను.

ఆయన తనమాటమీద అలాగే నిలబడుతూ, 'అబ్బే! నేనన్నది నువ్వు అర్థంచేసుకోలేదు.'

'అర్థమయిందండీ...అర్థమయింది' అన్నాను.

అంతే ఆ తరువాత ఆయన నాతో ఏమీ మాట్లాడలేదు.

చీకటినే రామం మమ్మల్నిలేపి ప్రయాణానికి సిద్ధం కమ్మన్నాడు. మేము కాలకృత్యాలు తీర్చుకొని, స్నానంచేసి వేడివేడి టిఫెను ఆరగించి, తెలతెల వారుతూందనగా ప్రయాణానికి రడీఅయ్యాం.

అంత చీకటినే వాడు ఇంట్లోనే టిఫెనూ అవీ చేయించి నందుకు నేనుకొంచం ఆశ్చర్యపోయినా, అంతా సక్రమంగా జరిగిపోతూన్నందులకు

లోలోన ఎంతో సంబరపడ్డాను. ఇంతలో టిఫెన్ కేరియర్లూ, అరటి ఆకులు పట్టుకొని, బయటకు వెళ్తూన్న నౌకరును చూసి, మా రామంతో, 'ఆ కేరియర్లెక్కడకురా...' అన్నాను వాడు సమాధానం చెప్పకుండా కళ్ళతోనవ్వి ఊరుకున్నాడు. నేను నా మనసులో 'ఒహో' అనుకున్నాను. ఇదంతా చూస్తూఉంటే, నాకు మహదానందం కలిగింది. ఆ ఆనందంతో ఆగదిలో ఉండలేక, ఒక్కసారి బయటకొచ్చాను.

ఏమిచెప్పను! నా ఆశ్చర్యానికి అంతులేదు గుమ్మానికి ఓప్రక్కను ఆగిఉన్న చక్కని కారొకటి నాముందుకు వచ్చి ఆగింది. మా రామం చేసిన ఈ ఎరేంజ్‌మెంట్సుకి వాణ్ని ఏవిధంగా స్తుతించాలో నాకుతోచలేదు. కాని ఈ ఆనందాన్ని ఏవిధంగానూ దాచుకోలేని నేను, మా రామంతో "కారెవ్వరిదిరోయ్" అనేశాను.

కారు సరాసరి పెట్రోలుకొట్ఠేసలంవద్దకుపోయి అక్కడ తన అవసరాలు తీర్చుకొనేందుకాగింది. నా మట్టుకు నేను బయలుదేరిన దగ్గరనుంచి చిల్లరగా మారకుండా తెగబాధపడుతూన్న ఒకేఒక్క పచ్చకాగితాన్ని బయటకుతీశాను. వెంటనే ఆయన మా రామంతో, "మీవాడికి కొంచెం బుద్ధిచెప్పండీ" అంటూ నా చేతిలోని ఆ నోటు లాక్కొని 'ఇప్పుడియ్యవయ్యా...ఎలా ఇస్తావో చూస్తాను'అంటూ డ్రైవరుకు తన జేబులోంచి పదిరూపాయలనోట్లు కొన్నితీసి, ఇవ్వబోయాడు. ఆయన ఈ చర్చకు చాల బాధపడిపోయాడు. నామట్టుకు నాకూ ఎంతో బాధ కలిగింది. మా రామం పెట్రోలు ఖర్చు పెట్టుకోవడం నా మనసు ససేమీ ఒప్పుకోలేదు. కాని ఎంత బ్రతిమాలినా వాడు నవ్వుతూ "ఇది మీవూరు కాదండోయ్...ఇక్కడమీపప్పుడకవ్..." అన్న మాటలు తప్ప మరేమీ మాట్లాడకుండా కళ్ళల్లో ఏదో సంతృప్తి తొణికిసలాడిస్తూ కారును వేగంగా పోనివ్వమన్నాడు. ఘాట్ రోడ్డు సమీపించేవరకూ మేం యీసంగతే తిరిగి తిరిగి మాట్లాడుకున్నా ఆ మీదట మాకారు పైపైకి, ఇంకా ఇంకా ఎత్తుకు తీసుకుపోతూంటే, మా మనసులు చుట్టూవున్న దృశ్యాల అందాన్ని తిలకించుటలో మునిగిపోయాయి.

ఆ సుందరమైన ప్రదేశంలో అరకు లోయలో విశ్రాంతిగా భోజనంచేసి, తిరిగి మాచ్ ఖండ్ దిశగా ప్రయాణించాము.

ఆ ఎత్తైన కొండలు, వాటిలో అక్కడక్కడ కనిపించే, గంధకం, అభ్రకం, కొన్నికొన్ని ఖనిజాల వింతవింత తళతళలూ, పసిపిల్లల ఉత్సాహంలా కొండల్లోంచి పైకి తన్నుకొచ్చే నీటిబుగ్గలూ చూస్తూ ఉండగానే, వెనక్కితిరిగిచూస్తే కనిపించే- విజ్ఞానపు శిఖరాలమీదకు మానవుడు నిర్మించుకున్న పెద్దపెద్ద మెట్లలాగ, అడ్డదిడ్డంగా పడిఉన్న ఆ ఎత్తైన కొండల వంకరటింకర్లలోని ఆ రోడ్డును, మాకారు అధిగమించింది. మాచ్ ఖండ్ సమీపంలో ఏవేవో జానపదగేయాల అతిమధురమైన వినిపింపులూ, పనివారి సమ్మెటవ్రేటులూ, ఇంజన్ల రవరవలూ వినిపించాయి.

ఇంతలో దూరంగా ఎత్తైన ఒక కొండ తలపై నుంచి తెల్లని పాలనురుగులా, వికసించిన మల్లెపూల ప్రవాహంలా, తెలివెన్నెల సోగనవ్వుల మిలమిలలా, బిలబిల కొండపైనుంచి చకచకక్రుమ్మరించినట్లుగా డుడుమాజలపాతపు దృశ్యం నేత్రాలకు మహదానందాన్ని చేకూర్చింది.

మా రామం డ్రైవరుతో వాళ్ళ చిన్నాన్నగారింటికి వెళ్ళి మేం వచ్చినట్లుగా చెప్పమని చెప్పి, వాళ్ళచిన్నాన్న, ఎక్కడ ఉన్నదీ అక్కడ ఉన్న వాళ్ళను అడిగి తెలుసుకున్నాడు. తీరా మేము అక్కడకు వెళ్ళేప్పటికి, ఆయన అక్కడనుంచి మరొక చోటికి అప్పుడే వెళ్ళినట్లు చెప్పారు.

నా మనస్సు ఆయన్ను ఎప్పుడు చూస్తానా ఎప్పుడు ఆయనను ఈయనకు పరిచయముచేస్తానా అని ఆత్రపడింది.

ఎటుచూసినా కొండలు, ఎటుచూసినా చెట్లు' పెద్దపెద్ద లోయలు., ఇవితప్ప అక్కడ ఇంక మరేవీలేవు. సముద్రమట్టానికి కొన్నివేల అడుగుల ఎత్తున ఉన్నామేమో మమ్మల్ని తాకుతూపోయే చల్లని చలిగాలుల విసురులు, కనిపిస్తూ కనబడని మంచుతెరల ఒయ్యారపు రాపిళ్ళు అన్నీ అన్నీ మనసు కెంతో మరపురాని దివ్యానుభూతుల బహుమతుల్ని బహుళంగా పంచిపెడుతున్నాయి. ఆ టన్నెల్సు, ఈ అక్విడక్టులు, కొండల్ని దొలిచేసే

ఆ యంత్రాలు. మానవుని ఈ అపారమైనశక్తి, ప్రకృతిని లొంగదీసుకుంటూన్న ఈ మేధాసంపత్తి విశేషంగా, విస్పష్టంగా కన్నులముందు అక్కడ ప్రదర్శించబడుతూంది.

ఇవన్నీ చూస్తూ ఉన్నా, నాలో ఏమిటో ఆ శివరామారావుగారిని ఎప్పుడు చూస్తానా అన్న విషయమొక్కటే ఊరికే ఆ జలపాతంలా పరుగులు తీస్తూంది. ఆ శివరామారావుగారు, ఈయన కలసిన వెంటనే తమాషా తమాషా కబుర్లు చెప్పుకుంటూన్నట్లు, ఇందుకు కారణభూతుడనైన నన్ను వారెంతో అభినందిస్తున్నట్లు ఏవేవో దశ్యాలు కళ్ళముందు అవతరిస్తున్నాయి.

ఈ తలపులలో మునిగిపోయిన నాకు సూర్యుడెప్పుడస్తమించాడో తెలియనేలేదు. మా చుట్టూ ఆ కొండల్లో చిక్కని చీకట్లు; జీవితంలో ఘోరంగా అవమానింపబడిన ఒక ఆత్మాభిమాని ముఖాన పారాడే నైరాశ్యంలా తారట్లాడుతున్నాయి.

అప్పుడే మా కారువచ్చి చీకటి గట్లమధ్య హుషారుగా ప్రవహించే వెలుగుల సెలయేరులా, మమ్మల్ని గమ్యస్థలానికి తీసుకొచ్చి చేర్చింది. అప్పటికింకా శివరామారావుగారు ఇంటికి రాలేదు. మేము స్నానాలుచేసేప్పుడు ఆయన ఎప్పుడువచ్చి తన గదిలో దూరాడో మరి, ఆ తరువాత ఆయన మరి బయటకు రాలేదు.

ఇంజనీరుగారు మా సమక్షంలోకి రాగానే ఆయనకు వీరిన ఎలా పరిచయం చేయాలో నేను తాపీగా ఆలోచించుకోవడం మొదలుపెట్టాను. నా మనసులోకి ఎంతో ఆనందం, తరుముకొచ్చింది. ఆయన రాగానే నేను పూర్వంలా సిగ్గుపడకూడదనుకున్నాను. చిన్నప్పటిలా కాకుండా నిర్భయంగా, ఏమీ తొట్రుపాటులేకుండా ధీమాగా ఆయన అడిగినవాటికి జవాబు చెప్పాలనుకున్నాడు.

ఇంతలో మారామం ఒకసారి మా దగ్గరకొచ్చి, తిరికి ఏమీ మాట్లాడకుండానే, లోనికి వెళ్ళిపోయాడు. ఈసారి వాడు వాళ్ళచిన్నాన్న గదిలోకి వెళ్ళాడు.

వాడికి వాళ్ళచిన్నాన్నంటే ఎంతో గౌరవం. వాడు ఆయనముందు పసిపిల్లాడిలా ఏమీ మాట్లాడనే లేదు. ఆయన ఏమిచెప్పినా వినడమేగాని ఆయనతో తాననుకున్నవి చెప్పడంకాని, ప్రశ్నించడంకాని చెయ్యనేలేదు.

ఇంతలో వారు ఆ గదిలోంచి బయిటకు వస్తూన్నట్లు అడుగుల అలికిడి వినిపించింది. నేనొక్కసారి, మామూలుగా కూర్చున్నవాణ్ణి ఇంకొంచెం సరిగ్గా కూర్చున్నా. ఒకసారి ఆ గుమ్మంవైపు చూశాను. అరే! మారామం ఒక్కడే ఆ గదిలోంచి బయిటకు వచ్చాడు. ఆయన రాలేదు. ఎందుకీ ఆలస్యం అనుకున్నా. ఇదిగోవస్తున్నాడనుకున్నా. కాని ఆయన రావడం మాత్రం పడలేదు. నాకు ఆకలి ఔతూంది. ఆయన రాడేమిటా అనిపిస్తూంది. "ఇదేమి మర్యాద" అని మనస్సు పదే పదే గ్రుచ్చి గ్రుచ్చి అడుగుతూంది. అంతకంతకూ నా మొగంలో కళ తగ్గిపోవడం మొదలుపెట్టింది. నాలోని ఉత్సాహాన్ని డ్రిల్లింగ్ మెషీన్‌తో తూట్లు తూట్లుగా చేస్తున్నట్లయింది. నా గుండె దడదడ కొట్టుకుంది. నాలో నాకే ఒక పెద్ద మనిషిని అమాంతంకా గంగలో ముంచేస్తున్నానా అనిపించింది. నామట్టుకు నాకు ఇది భరించ నలవి కాని బాధగా పరిణమించింది.

అప్పుడే మా రామం మా దగ్గరకొచ్చి ఆ కొండలపైకుంచి ఆ చీకటిలోయల్లోకి, ఆ అగాధాల్లోకి ఒక్కసారిగా మమ్మల్ని అమాంతంగా త్రోసేశాడు. ఇంక మేం బ్రతికిలేము. నిజంగా మేము బ్రతికిలేము. కాని ఆ మాటలు ఇంకా వినబడుతూనే ఉన్నాయి.

"లెండి భోజనానికి" దీనంగా, అమాయకంగా, అశక్తతతో, అసమర్థతతో వినిపిస్తున్నాయి.

ఇదండీ జరిగిన సంగతి.

అయితే ఆ మరునాడు ఏం జరిగిందో తెలుసాండి? శివరామారావుగారు నాదగ్గరకు గబగబా వచ్చి, "అబ్బ! ఎంత ఏపుగా పెరిగిపోయావోయ్ సూర్యం! నేనింకా కుర్రాడివే అనుకుంటున్నాను!" అని నాతో అని ఆ తరువాత ఆయనవైపు తిరిగి "క్షమించండి.\..చిన్నవాడైన సూర్యంతో చిన్నవాళ్ళే వచ్చి ఉంటారు...ఎప్పుడు చూస్తే ఏం కొంపమునిగింది...మన సూర్యానికి నా సంగతి తెలియదా అనుకున్నానండి. ఈ విషయంలో మీరు నన్ను క్షమించాలి. కనీసం ఈసంగతి మా రామమైనా చెప్పాడు కాదు" అన్నాడు. ★